# మావారూ- పేక్ష్యామ్మ్క్నరూ!

రిక్షా దిగి యింట్లోకి అడుగు పెట్టిన నాకు గుండె దడదడ లాడింది. గబగబా బుట్ట చేత పుచ్చుకుని లోపలికెళ్ళిపోయాను. పిల్ల వెధవలేరీ? భయం భయంగా హాల్లో కొచ్చాను. మా పక్కింట్లో వుండే ఎస్సై ఇంద్రారెడ్డి, ఒక కానిస్టేబుల్ యిద్దరూ గంభీర వదనాలతో హాల్లో ఉన్న ట్రంకు పెట్టెంత పార్శిలు చుట్టూ తిరుగుతున్నారు. నాకు చెప్పలేనంత భయమే సింది. నెమ్మదిగా నోరు పెగుల్చుకుని "ఏ... ఏం జరిగిందండీ? మావారేరీ? పిల్లలు కనిపించారా?" అన్నాను. ఇంద్రారెడ్డి నన్ను ఆపాదమస్తకం అనుమానంగా చూచాడు.

"మీరు ఊరు కాడి నుండి వస్తున్రా?" అన్నాడు యింటరాగేషన్‌కు నాందిగా.

"అవునూ. నిన్న పొద్దున మా నాన్నకు బాగాలేదని తెలిసి వెళ్ళాను. యిదే రావటం." సాలోచనగా తల వంకించాడు. "మీ వారు పొద్దున సర్వే కెళ్ళిన్రు. మీ పిలగాళ్ళు మా యింట్ల నాష్త జేస్తున్రు."

హాయిగా ఊపిరి పీల్చుకుని "మరి... మీరేమిటి యిలా..." అన్నాను.

"అదేనమ్మా. ఈ పార్శిలు గంట కిందట ఎవరో తెచ్చిన్రంట. పిలగాళ్ళతో 'ముట్టుకోకండి. బాంబులున్నాయి. పేలి సచ్చిపోతర'ని చెప్పి ఎళ్లిపోయిన్రంట. నేను పోలీస్టేషన్కి పోలేదు. పిలగాళ్ళు ఒచ్చి చెప్పిన్రు వొచ్చిన."

నాకు తల తోకా అర్థం కాలేదు. ఆ పార్శిలు పైన ఏదీ రాసి లేదు. సాదా పూదా రంగు పేపరు అతికించి వుంది. బాంబు లేమిటి, పేలి చచ్చిపోవటమేవిటి? పోనీ విప్పి చూద్దామంటే... లోపల ఏముందో ఏమో?

"మధ్యాహ్నం వచ్చేసారు ఆయన. అప్పటి దాకా—" నసిగాను.

"అది సరేనమ్మా. ఇంతలో పేలిపోతే ఎంత ప్రమాదం!" కానిస్టేబుల్ అన్నాడు.

"అదీ నిజమే!"

ఇంతలో పని పిల్ల పద్మ వొచ్చింది 'ఎప్పుడొచ్చారమ్మగారూ!' అంటూ. ఆక్షణంలో అది దేవతలా కనిపించింది—"ఏమే పద్మా! పొద్దున పనికి వచ్చావా? ఈ పార్శిలు ఎవరు తెచ్చిచ్చారో నీకేమైనా తెలుసా?" అనడిగాను ఆత్రుతగా.

"ఇదా... యిదీ... ఎవరో ఒక బాబుగారు తెచ్చి యిక్కడే పెట్టి, పిల్లలకీ, నాకూ, 'ముట్టుకోబాకండి, బాంబు పేలి సచ్చిపోతారు' అని బెదిరించి, పిల్లల చేతిలో చెరో బిస్కతు పొట్లం పెట్టి ఆటోలో రఁయ్యిన ఎల్లిపోయినారు" అన్నది తాపీగా.

"ఏడ్చినట్టే వుంది నీ నిదానం! బాంబులూ, చావులూ అని ఆ వెధవెవడో చెప్పిపోతే, నీ దొవన నువ్వు ఏవీఁ పట్టనట్టు వెళ్ళిపోయావుటే! పిల్ల కోతులు పీకి లాగుతారే



శ్రీదేవీ మురళీధర్

మోని జాగ్రత్తగా చూసుకోవద్దూ. చుట్టు పక్కల నలుగురికీ తెలియజెప్పద్దూ... అయోమయపు పక్షీ!" అంటూ అక్కను తీర్చుకున్నాను. అది 'డోంట్‌కేర్' అన్నట్లు చప్పరించేసి "ఆఁ పొండమ్మా! అన్నింటికీ గగ్గోలు పెట్టేస్తారు! ముట్టుకుంటే పేల్తదని కదా ఆ బాబుగారన్నది! పిల్లలిద్దరూ భయపడి ముట్టుకోనే ముట్టుకోరాయె." అన్నది... "ఓసి నీ లాజిక్కు దొంగల్దోలా! దిక్కుమాలిన ధైర్యమూ నువ్వూనూ" అని తిట్టి దాన్ని అవతలికి పంపించేశాను. పిల్లలిద్దరూ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రారెడ్డి యింట్లో టిఫిన్లు మేసి పాలోమంటూ వచ్చారు—"అమ్మా అమ్మా... వచ్చేశావా! మనింటికి పేలే బాంబు వచ్చింది చూశావా" అంటూ! "ఎవర్రా నానీ యిది తెచ్చిచ్చింది?" అనడిగాను జ్యేష్ఠుణ్ణి. "ఆటో అంకుల్" అన్నాడు వాడు అయిదు నిముషాలు ఆలోచించి.

ఇంద్రారెడ్డి డైరీ తీసి చకచకా నోట్ చేసుకోవటం చూచి "ఏమిటండీ రాసుకుంటున్నారు?" అని అడిగాను.

"మీ పిల్లోడు పేరు చెప్తాండు కద! పాపం యాద్ వొచ్చినట్లుంది" అన్నాడు.

"ఆటోలో వచ్చిన వాళ్ళందర్నీ మావాడు 'ఆటో అంకుల్' అంటాడండీ ఖర్మ" అన్నాను. నిరుత్సాహంగా డైరీ మూసేశాడతను. "ఆ ఆటో అంకుల్ని యింతకు ముందెప్పుడైనా చూశావా? బాగా జ్ఞాపకం తెచ్చుకో" అన్నాను వాణ్ణి కూర్చోబెట్టుకుని.

నానీ తీవ్రంగా ఆలోచించి, తల అడ్డంగా ఊపి "నువ్వు చెప్పరా బబ్బూ! ఆ అంకుల్ ఎవరూ?" అనడిగాడు తమ్ముణ్ణి. పాపం ఇంద్రారెడ్డి డైరీ మీద పెన్ను పాళీ ఆనించి నోట్ చేసుకోవటానికి సిద్ధంగా వున్నాడు. బబ్బూ ఇంటి కప్పు వంక తీక్షణంగా చూచి "బిస్కెట్ అంకుల్" అన్నాడు. ఇంద్రారెడ్డి రాయబోయిన వాడల్లా ఆగి 'రాయనా వొద్దా' అన్నట్లు చూశాడు నావంక. అంత చికాకులోనూ నాకు నవ్వొచ్చింది. "మా పిల్లల వల్ల మీకే సహాయమూ లభించదు సుమా! ఇంకేదైనా మార్గం ఆలోచించండి" అన్నాను.

ఇంతలో పద్మ ఏదో గుర్తొచ్చినట్లు పరిగెత్తుకుంటూ వొచ్చి "అమ్మగారమ్మగారూ! ఆఁ. ఆ బాబుగారు ఏదో అమిరికా అన్నాడు సరిగ్గా అర్థం కాలేదు గాని" అన్నది.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరి పడ్డాడు ఇంద్రారెడ్డి. "అయితే అమెరికా వోళ్ళు సరాసరి మీ యింటికాడికే పంపేసిన్రా?" అన్నాడు అనుమానంగా నా వంకా, పిల్లల వంకా చూస్తూ. నాకేమీ బోధపడటం లేదు. అమెరికాలో ఎవరూ లేరే. అయినా బాంబులు తెచ్చిచ్చే వాళ్ళెవరు? ఇదేదో టెర్రరిస్టుల గొడవ కాదు కదా! బాప్‌రే! ఢిల్లీలో ట్రాన్సిస్టర్ బాంబుల గురించి చదివినదంతా గుర్తొచ్చి వణికిపోయాను.

ఇంతలో ఆపద్బాంధవుడల్లే మావారు సర్వే నుండి రానే వచ్చారు. అందరివీ చాటముఖాలైనై. ఇంద్రారెడ్డిని చూసి పలకరింపుగా నవ్వి "ఏమిటి? ఎనీ ప్రాబ్లం?" అనడిగారు ఆ గంభీర వాతావరణం చూసి.

ఇంద్రారెడ్డి టూకీగా విషయం చెప్పగా విని, ఒక్క క్షణం బిత్తరపోయి, తేరుకుని ఫకాల్న నవ్వేశారు. పరపరా ఆ పాకెట్‌ను చించేశారు మేమంతా వారిస్తున్నా వినకుండా. అంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నాము. లోపల ఒక తమాషాగా వున్న బాక్సు లాంటి పరికరముంది. ఇంద్రారెడ్డి ఆసక్తిగా ముందుకు వంగి—"ఇదేనాండి—న్యూక్లియర్ బాంబ్ వేసే మిషన్" అనడిగాడు. మావారు జవాబు చెప్పకుండా నవ్వి—"అమెరికా నుంచి వొచ్చింది!" అన్నారు కొంటెగా చూస్తూ. "అదేనండీ సామీ! రీగన్ మనుషులు పంపి వుంటారేమో", అన్నాడు ఇంద్రారెడ్డి తనకున్న పరిజ్ఞానంతో. "కాదు. జగన్ తెచ్చాడు" అన్నారు ఈయన.

"వాడెవడు బద్మాష్!" మావారు ఎందుకైనా మంచిదనుకున్నారేమో నవ్వేసి—"జగన్ రీగన్ మనిషి కాదండీ ఎస్సైగారూ! నా స్నేహితుడి తమ్ముడు. మొన్ననే అమెరికా నుండి వచ్చాడట." అంటూ నా వైపు తిరిగి—"గుర్తుందా? వాణ్ణి ఎమ్మెస్సీలో చేర్చేటప్పుడు నాన్నే డబ్బు సాయం చేశారు. తరువాత అమెరికా వెళ్ళి స్థిరపడిపోయాడు. ఇన్నేళ్ళకి తిరిగొచ్చాడు. నాకు ఈ బహుమతి తీసుకొచ్చాడు." అంటూ ఆ మిషన్‌ని జాగ్రత్తగా అటూ, యిటూ తిప్పి పరీక్షించారు. "మరి ఆ సంగతి చెప్పి వెళ్ళొచ్చుగా ఆ పెద్దమనిషి? ఇందర్ని గాభరా పెట్టి చంపకపోతే" చికాగ్గా అన్నాను.

"ఎవరికి చెబుతాడు? నాకు ఆఫీసుకు ఫోన్ చేస్తే 'మా ఆవిడ ఊళ్ళో లేదు. మా యింట్లో పిల్లలుంటారు. అక్కడ పెట్టించెయ్.' అన్నాను.

'మరి పిల్లలు అల్లరి చేస్తూ ముట్టుకోరా' అనడిగాడు జగన్.

'ఆఁ. ఏదో ఒకటి చెప్పి బెదిరించు లెద్దూ. మళ్ళీ కలుద్దాం.' అని ఫోను పెట్టేసి సర్వేకి వెళ్ళిపోయాను హడావుడిగా. ఆ జగన్‌గాడు 'బాంబుంది పేలుతుంది' అని చెప్పివుంటాడు బెదిరింపుకి ఈ పిల్లగాడిదలు దడుచుకుని సరాసరి సబ్ యిన్‌స్పెక్టర్‌గారికి రిపోర్టు చేస్తారని వాడు కలగని వుంటే అలా బెదిరించకనే పోను." అన్నారాయన తాపీగా తాంబూల సేవానంతరం అన్నట్లు! "మరి యింతకీ అదేమిటో చెప్పారు గారు" అన్నాను కుతూహలంగా ఆ మిషను వంక చూస్తోన్న ఇంద్రారెడ్డిని జాలిగా చూస్తూ.

"ఇదా? తెలీదూ... 'వేక్యూమ్ క్లీనర్' అనీ—యిళ్లు, సోఫాలూ గట్రా శుభ్రపరిచే యంత్రం. నీకు యిహ చీపురకట్టల్తో పనేలేదు. క్షణంలో అద్దంలా యింటినంతటినీ క్లీన్ చేస్తుంది. మానవ మేధస్సు చూడు ఎంత పరిణితి చెందిందో" అని లెక్చరుకు పూనుకుంటుంటే ఇంద్రారెడ్డి ఉస్సూరంటూ లేచి టోపీ పెట్టుకుని కానిస్టేబుల్‌తో సహా బయటికి నడిచాడు.

మావారు ఆ క్లీనరు ప్రేమలో పడ్డారు. అస్తమానం దాన్ని తుడవటం (అది యిల్లు తుడవటం సంగతి అటుంచి) తోనే ఆయన తీరిక సమయమంతా సరిపోతోంది. క్లీనరు అడుగు పెట్టి మూడు రోజుల తరువాత ఓ సాయంత్రం బియ్యం, ఆవాలు శుభ్రం చేద్దామని పీటమీద పోసుకొని కూర్చుంటే ప్రక్క వాటా పిల్లాడు ఆరున్నొక్క రాగం ఆలపించటం వినిపించింది. మా తీవ్రవాదులిద్దరూ అక్కడే వున్నారు. గిచ్చారో, గిల్లారోనని గాభరాపడుతూ లేచి వెళ్తే వాడి రెండు చేతులూ చెరో పక్కా పుచ్చుకుని లాగుతూ "టగ్ ఆఫ్ వార్" ఆడుతున్నారీ గాడిదలిద్దరూ! ఇద్దర్నీ నాలుగు తగిలించి యింట్లోకి లాక్కొచ్చాను. మావారు వాక్యూమ్ క్లీనర్‌తో సోఫాలు శుభ్రం చేస్తున్నారు. క్రిందటి రోజే పనిమనిషితో "రేపటి నుంచి ఇల్లు నేనే చిమ్ముకుంటాను. అందుకని నీ జీతంలో యిరవై తగ్గిస్తున్నా" నని ఎనౌన్స్ చేశారు. "మీరా అయ్యగారూ!" అని విస్తుపోయిందది!

"ఆఁ నేనే. ఏం?" అని ఎదురడిగారు. అది నావంక ఎగతాళిగా చూడటం గమనించి క్లీనర్ వంక చూపాను. తన కడుపు కొట్టిన వేక్యూం క్లీనర్ని చూసి అక్కసుగా మెటికలు విరిచిందది. దాన్ని చిమ్మొద్దనైతే చెప్పారు కానీ, ఆ ముహూర్తం ఎట్లాంటిదో ఒక రోజంతా కరెంటు పోయింది. చచ్చినట్లు పనిపిల్ల వుండి కూడా నేనే యిల్లూ వాకిలీ చిమ్ముకోవాల్సి వచ్చింది. మావారు పేపరు చాటు నుండి ఎలక్ట్రిసిటీ బోర్డుపై దుమ్మెత్తి పోశారు. ఆ పోయిన కరెంటు వచ్చిన క్షణమే క్లీనరును పనిలోకి దించారు. నేను పిల్లల్ని కొట్టిన పాపానికి ఓదార్చి, కారప్పూస వాళ్ళ ముందు పెడితేగానీ వాళ్ళు శాంతించలేదు. బయటి కొచ్చి చూద్దును కదా, ఆవగింజ నమూనాకి కూడా కనిపించలేదు. బియ్యం గిన్నె పీట గోడకి జేరవేసి వున్నాయి. పావుకిలో ఆవాలు! అదురుతున్న గుండెతో "ఏవండీ, పాపం హాలంతా తుడిచినట్లున్నారే" అన్నాను.

"అవునవును. చూడు ఎంత శుభ్రంగా వుందో, ఎంత నీట్‌గా వుందో! నేల మీదే పడుకోవాలనిపిస్తోంది, సో క్లీన్!" అన్నారు రెచ్చిపోయి సకలం తుడిచేస్తూ. "అది నిజమే కానీ, యిందాక యిక్కడ..." అని నేలపై చూపెడుతూ వుంటే... "అవునూ... అంత గిన్నెడు బియ్యంలో అన్ని రాళ్ళా! ఏ పావుకిలో రాళ్లో వుంటాయి. అవునా? ఏ అంగడిలో కొన్నావు? ఎంత నీచులైనా అన్ని రాళ్ళు కలుపుతారా ఎక్కడైనా? రిడిక్యులస్" అన్నారు కోపంగా. నాకు కాలి కింద నుంచి భూమి కదిలిపోతున్నట్లనిపించింది క్షణం పాటు. "అయితే... అవన్నీ... ఎత్తి పక్కకు పోశారా?" అన్నాను కొద్దిగా మిగిలున్న ఆశ చావక. "ఇంకా చీపురు కట్టల దశాబ్దంలో వుండి మాట్లాడకు. క్లీనర్‌తో అన్ని రాళ్ళు జుఁయ్ జుఁయ్ మని 'సక్' (Suck) చేయించాను." అన్నారు గర్వంగా.

"అవి రాళ్ళు కావండీ బాబూ! ఆవాలు! పావుకిలో ఆవాలు మింగి కూర్చుందీ దిక్కుమాలిన మిషను" అన్నాను ఆవేశంగా.

"చాల్లే వూర్కో. ఈ మిషనంతే! అడ్డ మొచ్చినవన్నీ మింగేస్తుంది. అయినా హాల్లో కూచుని ఆవాలు ఏరమని

ఎవరే చెప్పిందీ?'' అన్నారు ఉడుక్కుంటూ.

"అయినా అవాలు రాళ్ళలాగా ఎలా కనబడ్డాయండీ. ఆ చత్వారవు జోడు తియ్యొద్దు భగవంతుడా అంటే వినరాయె! అది పెట్టుకోలేదల్లే వుంది. ఒకటి చూస్తే మరోలాగు కనబడుతోంది మీకు. ఖర్మ'' అన్నాను తలబాదుకుంటూ. "ఏడిశావులే!'' అనేసి మిషన్ ఆపి, దానికి తుడుపు సేవలు చేసి లోపల వుంచారు. "ఇదుగో, మీరెవరూ ముట్టుకోకండి. పాడుచెయ్యగల్రు'' అనేశారు పైగా.


ఓ నెల తిరిగే సరికి మావారికి దాని మీద మోజు తగ్గింది. రోజూ దాన్ని తియ్యటం, పిల్లల్ని దగ్గరికి రాకుండా కట్టడి చెయ్యటం, కరెంటు వెచ్చిస్తూ దాన్ని పేషంటును తిప్పినట్లు జాగ్రత్తగా యిల్లంతా తిప్పటం, లోపల దుమ్ము నిండిన బాగ్‌ను తడవతడవకీ శుభ్ర పర్చటం, అంతా బోర్ కొట్ట సాగింది. మమ్మల్ని ముట్టుకోవద్దన్నారని ఆయన గదులు తుడిచేటప్పుడు నేను ఏ వారపత్రికో ముందేసుకుని పడక్కుర్చీలో రిలాక్సవటం ఆయనకి కాస్త చిన్నతనంగానే వుంది.

"పోనీ నువ్వు నేర్చుకోరాదూ, యిది 'ఆపరేట్ చెయ్యటం'' అని అన్నారు ఓ నాడు నాందిగా. "అబ్బే! అవన్నీ నాకు చాతకావండీ... మిషన్లతో వ్యవహారమాయె! ఏది చెడినా నా మెడకు చుట్టుకుంటుంది.'' అన్నాన్నేను వట్టనట్లు. "అది కాదోయ్! నీలాంటి చురుకైన గృహిణులు యిట్టే పట్టేయగల్రు ఇలాంటి మెళకువలన్నీ. ఎంత సులభమనుకున్నావ్?'' అని వివరించబోతుంటే "సారీ. నన్ను విసిగించకండి.'' అనేసి నవ్వు అవుకుంటూ లేచి వెళ్ళిపోయాను. రాను రాను... చెయ్యి బెణికిందనీ, ఆఫీసులో రాసి రాసి వేళ్లు నొప్పెడుతున్నాయనీ సాకులు పెట్టి ఏరోజు కారోజు వేక్యూమ్ క్లీనర్ పని ఎగగొట్టసాగారు. అలా నెలన్నర తిరిగే సరికి వారానికి ఒకసారి మాత్రమే క్లీనర్ పనిలోకి రాసాగింది. పాతకాలం చీపురు కట్ట యధావిధిగా తన బాధ్యతను నిర్వర్తిస్తూ ఆదివారం మాత్రం రెస్టు తీసుకుంటోంది.

తమ్ముడి కొడుకు బారసాలకు ఊరు వెళ్ళాను. రెండు రోజుల తరువాత తిరిగొచ్చిన నాకు పద్మ యిల్లు చిమ్ముతూ ఎదురైంది. నాకు సంతోషమనిపించి "ఏమే! అయ్యగారి ఆర్డరుతోనే చిమ్ముతున్నావా?'' అనడిగాను రహస్యంగా. ఇంతలో ఆయన రానే వచ్చారు.

"వచ్చావా, రారా! హిహిహి... యివ్వాళేమైందంటే వేక్యూమ్ క్లీనరు ట్రబులిచ్చింది కొద్దిగా... అందుకనీ... పద్మని నేనే చిమ్మమన్నా'' అన్నారు పట్టుబడిన దొంగలాగా. పరిశీలనగా ఆయన వంక చూచి "ఆ రిపేర్లూ అవీ యిండియాలో చెయ్యరేమో కదూ! మళ్ళీ జగన్‌తో పాటే పంపి బాగు చేయించాలి కదూ! అప్పటి దాకా పద్మే చిమ్మాలేమో... కదూ?'' అనడిగాను.

"అంతే అంతే, అవును కదా మరి! చాలా టైం పడుతుంది. అసలు మన యిండియాలో యిదేనోయ్ ప్రాబ్లమ్! ఫారిన్ వస్తువులు మెయిన్‌టెయిన్ చెయ్యటానికి తగిన వసతులిక్కడ లేవు. వెరీ అండర్ డెవలప్డ్.''




అన్నారు లెక్చరుకు ఉపక్రమిస్తూ. "అవున్లెండి. మీరు చెబుతూ వుండండి నేనిప్పుడే స్నానం చేసివస్తా'' అంటూ లోపలికెళ్ళిపోయాను నవ్వుకుంటూ.

ఆ మధ్యాహ్నం జగన్, జగన్ భార్యా వచ్చారు. రెండు రోజుల్లో వెళ్ళిపోతున్నారట. కాఫీలవీ యిచ్చాక, ఆ క్లీనరు విషయం ప్రస్తావించి అది తెచ్చి జగన్ ముందుంచాను. "ఇదేదో రిపేరు కొచ్చిందన్నారాయన'' అన్నాను.

అతడు అంతా పరీక్షించి ఆన్ చేసి "అంతా బాగానే వుంది వదినగారూ! ఏమీ పాడు కాలేదే'' అన్నాడు.

మావారి బద్ధకాన్ని క్లీనర్ అవాలు స్వాహా చేసిన ఉదంతాన్ని అతడికి వివరంగా చెబితే, భార్యా భర్తా ఒహటే నవ్వు! "బాబూ జగన్! నువ్వు అంత దూరం నుంచి మా కోసం జ్ఞాపకంగా యింత ఖరీదైన వస్తువు తెచ్చావు! నీ మనసులో మాకున్న చోటు చాలు మేం తృప్తి పడటానికి! మేమా మధ్య తరగతి కుటుంబీకులం, అద్దె యిళ్ళల్లో మగ్గుతున్నాం! యిల్లు చూడబోతే షాబాదు రాళ్ళతో గరకు నేల! మాకా డోర్‌టు డోర్ తివాచీలూ, హంగులూ లేవు! చీపురు ఆనించి చిమ్మాల్సిందే! పిల్లలు క్షణక్షణానికి ఇంట్లోకీ వీధిలోకీ తిరుగుతూ దుమ్ముమయం చేస్తారు యింటిని! ఆ క్లీనర్ని మాటి మాటికీ తీస్తూ వుండలేం కదా. పది మంది నౌకర్లు, చాకర్లూ వుండి, యింటినంతటినీ అద్దంలా వుంచగలిగే స్తోమతు కలవాళ్ళకే నాయనా ఈ పరికరాల ఉపయోగం! ఈ పిల్లలు తెలిసీ తెలీక ఏ మీట నొక్కినా చెడి వూరుకుంటుంది. నువ్వు అన్యథా భావించక దీన్ని ఎవరైనా ఉపయోగించగల వారికి యివ్వు'' అన్నాను మనసులో మాటను బైట పెడుతూ.

"అదేమిటి వొదినగారూ! మీకని తీసుకొస్తేను'' అన్నాడతను యిబ్బందిగా. "అలా అనుకోకు జగన్! దేనినైనా సరైన విధంగా ఉపయోగిస్తేనే దాని విలువ, సార్థకత! నువ్వు యిచ్చావని, దీన్ని వాడకుండా, అటక ఎక్కిస్తే నీకు తృప్తి కలుగుతుందా? చెప్పు, నేనే తీసుకెళ్ళమంటున్నాను కదా! ఇంతగా మా మీద ప్రేమతో వచ్చారు, అదే పదివేలు. కాదనకు బాబూ!'' అన్నాను నచ్చజెపుతున్నట్లుగా.

"అది కాదు వొదినగారూ! తమాషా ఏమిటంటే... మా వాళ్ళు ఒకరిద్దరికి కూడా యివే క్లీనర్లు తెచ్చి యిచ్చాము. వాళ్ళూ 'ఏమనుకోవద్ద'ని సర్ది చెప్పి నిన్ననే తిరిగి యిచ్చేశారు. ఇవి తెచ్చి చాలా పొరపాటు చేశాను'' అన్నాడతను నొచ్చుకుంటూ.

"ఒక పని చేద్దామండీ! మాంచి చీపురు కట్టలు ఓ డజను కట్టించి అమెరికాలో మన వాళ్ళకు ప్రెజెంటుగా తీసుకెళ్దాము'' అన్నది జగన్ భార్య నవ్వుతూ.

అంతా శ్రుతి కలిపాము. పాపం జగన్, అతని భార్యా సెలవు తీసుకుని వేక్యూమ్ క్లీనర్ని మోసుకుంటూ ఆటో ఎక్కారు.

ఆ సాయంత్రం మావారు ఆఫీను నుండి వచ్చాక మా పిల్లలిద్దరూ చెరో పక్కనా జేరి "నాన్నా నాన్నా! నీ చీపురు కట్ట మిషనుందే, దాన్ని ఆటోలో వచ్చిన ఆంటీ అంకుల్ పట్టుకెళ్ళిపోయారు. అమ్మ యిచ్చేసింది.'' అని రిపోర్టు చదివారు. ఏమంటారోనని భయపడ్డాను.

"అదీ పాడైపోయింది నానీ! అందుకే అమ్మ రిపేరు కిచ్చింది'' అన్నారాయన.

"మరీ... మరీ... నువ్వెట్లా చిమ్ముతావు రేపట్నుంచి పాపం'' అన్నాడు నానీ జాలిగా.

"నేనెందుకు చిమ్ముతాన్రా. మిషను లేదుగా. పద్మ చిమ్ముతుంది—చక్కగా చీపురు కట్టతో'' అన్నారాయన హాయిగా నవ్వేస్తూ. □